సాక్షి రాజన్న సిరిసిల్ల

మంగళవారం। 3। అక్టోబర్। 2023

ఆందోళనలో అంగన్‌వాడీలు



సిరిసిల్లటౌన్: సమస్యలు పరిష్కరించాలని అంగన్‌వాడీ కార్యకర్తలు డిమాండ్ చేశారు. ఆర్డీవో ఆఫీస్ ముందు ఏఐటీయూసీ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలు సోమవారం 22వ రోజున నిరసన తెలిపి మాట్లాడారు. ప్రభుత్వం వెంటనే తమను పర్మినెంట్ చేసి రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల బెనిఫిట్స్ అందించాలని కోరారు. గాంధీచౌక్ వరకు ర్యాలీ చేపట్టి గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందించారు. ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సామల మల్లేశం, జిల్లా కార్యదర్శి కడారి రాములు, అంగన్‌వాడీ జేఏసీ జిల్లా అధ్యక్షురాలు కల్లూరి చందన, ప్రధాన కార్యదర్శి ఎదురుగట్ల మమత, కొండికొప్పల పద్మ, శ్యామల తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

- సబ్ జడ్జి రవీందర్



వేములవాడ: పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, అప్పుడే ఆరోగ్యంగా ఉంటామని వేములవాడ సబ్‌జడ్జి సట్టు రవీందర్ పేర్కొన్నారు. గాంధీ జయంతిని పురస్కరించుకుని కోర్టు ఆవరణలో సోమవారం న్యాయవాదులు, కోర్టు సిబ్బందితో కలసి శ్రమదానం చేశారు.

అభిషేకం టికెట్ల కోసం భక్తుల ఆందోళన



వేములవాడ: రాజన్న ఆలయంలో సోమవారం అభిషేకం టికెట్ల కోసం భక్తులు ఆందోళనకు దిగారు. నాలుగు గంటల నుంచి అభిషేకం టికెట్ల కోసం క్యూలో నిల్చుంటే.. 80 టోకెన్ల వరకే పరిమితం చేశామంటూ కౌంటర్‌ను మూసివేయడంపై కోపోద్రిక్తులయ్యారు. ఎస్పీఎఫ్ సిబ్బంది అక్కడికి చేరుకుని పరిస్థితిని చక్కదిద్దారు. ఈ విషయమై ఈవో కృష్ణప్రసాద్‌ను వివరణ కోరగా భక్తుల రద్దీ అధికంగా ఉండడంతో సామాన్య భక్తులకు ఇబ్బంది కలగకుండా ఉండేందుకు 80 టోకెన్లు మాత్రమే ఇస్తున్నట్లు తెలిపారు. ఇక నుంచి నిత్యం అభిషేకం టోకెన్ల వివరాలతో కూడిన నోటీసుబోర్డు ఏర్పాటు చేస్తామన్నారు.

మరిమడ్లలో అంబేడ్కర్ విగ్రహం ధ్వంసంపై నిరసన



కోనరావుపేట(వేములవాడ): మండలంలోని మరిమడ్లలో అంబేడ్కర్ విగ్రహాన్ని గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. విగ్రహం తల, చేతిపై చెక్కివేశారు. విషయం తెలుసుకున్న పలువురు నాయకులు సోమవారం ఆందోళనకు దిగారు. వారు మాట్లాడుతూ విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారిని శిక్షించాలని కోరారు. బీఎస్పీ మండలాధ్యక్షుడు కుమ్మరి దేవదాస్, భీమ్ ఆర్మీ జిల్లా అధ్యక్షుడు దొబ్బల ప్రవీణ్, కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు ఎరవెల్లి నాగరాజు, సర్పంచ్ మాట్ల అశోక్, జింక శ్రీనివాస్, సింగం నారాయణ, బానోత్ నరేశ్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి



రుద్రంగి(వేములవాడ): కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే బడుగు, బలహీనవర్గాల అభివృద్ధి జరుగుతుందని డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. రుద్రంగిలో సోమవారం స్థానిక నాయకులతో కలిసి ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే అమలు చేసే 6 డిక్లరేషన్ కరపత్రాలను పంపిణీ చేశారు. పార్టీ మండలాధ్యక్షుడు తూము జలపతి, రుద్రంగి సర్పంచ్ తర్రె ప్రభలత, ఉపాధ్యక్షుడు తర్రె మనోహర్, గ్రామాధ్యక్షుడు సామ మోహన్‌రెడ్డి, డీసీసీ కార్యదర్శులు చెలుకల తిరుపతి, గడ్డం శ్రీనివాస్‌రెడ్డి, తర్రె లింగం పాల్గొన్నారు.

వినాయక నిమజ్జనంలో లాఠీచార్జిపై నిరసన



సిరిసిల్లక్రైం: వినాయక నిమజ్జనం సందర్భంగా కొందరు మండప నిర్వాహకులపై పోలీసులు లాఠీచార్జి చేయడాన్ని నిరసిస్తూ జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్‌చౌరస్తాలో భజరంగ్‌దళ్, బీజేపీ నాయకులు సోమవారం రాస్తారోకో చేపట్టారు. పోలీసులు నిరసనకారులను స్టేషన్‌కు తరలించారు. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డబోయిన గోపి మాట్లాడుతూ హిందువుల మనోభావాలు దెబ్బతీసేలా వినాయక నవరాత్రుల్లో పోలీసులు వ్యవహరించారన్నారు. మండపాల వద్ద నేమ్‌ప్లేట్ లేని పోలీసులు యువకులను లాఠీలతో కొట్టడం ఏ రకంగా సమర్థించుకుంటారో పోలీస్ అధికారులు వివరణ ఇవ్వాలని కోరారు. విధుల్లో ఉన్నది పోలీసులా? పోలీసుల ముసుగులో ఉన్న దుండగులా? అనే అనుమానం కలుగుతుందన్నారు. నాయకుప్జీ వంశీ, నాగుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

దళారులు చెప్పిందే ధర !

క్వింటాల్ రూ.1800

- మద్దతు ధరకు రూ.403 తక్కువ
- రైతుల శ్రమ.. దళారుల పాలు
- మొదలైన వానాకాలం ధాన్యం విక్రయాలు
- ప్రారంభంకాని కొనుగోలు కేంద్రాలు
- జిల్లాలో 1.62లక్షల ఎకరాల్లో వరిసాగు
- 3.76 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి అంచనా



ఇది ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్ శివారులోని గాజులపల్లె వద్ద నర్సయ్య అనే కౌలు రైతు సోమవారం తన పొలాన్ని కోశాడు. వడ్లు కుప్పపోశాడు. వడ్లను ఆరబెట్టి అమ్ముదామంటే ఇంకా ధాన్యం కొనుగోలు కేంద్రాలు మొదలుకాలేదు. ప్రభుత్వం క్వింటాల్‌కు రూ.2203 మద్దతు ధరగా నిర్ణయించింది. కానీ రైస్‌మిల్లర్‌కు నేరుగా పచ్చివడ్లను రూ.1800 క్వింటాలు చొప్పున తూకం వేస్తున్నాడు. ప్రతి క్వింటాల్‌కు రూ.403 తక్కువే అయినా.. ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఇంకా తెరవకపోవడంతో నర్సయ్యకు దళారులు తప్ప మరో మార్గం కనిపించలేదు. ఇలా ఒక్క నర్సయ్యనే కాదు.. జిల్లాలో వానాకాలం సీజన్‌లో ముందుగా నాట్లు వేసిన రైతులు ఇప్పుడు వరి కోతలు మొదలుపెట్టారు. వీరంతా పచ్చివడ్లను తక్కువ ధరకే దళారులకు విక్రయించాల్సి వస్తోంది.

సిరిసిల్ల: సీజన్ ఆరంభంలోనే జిల్లాలో దళారులు రంగ ప్రవేశం చేశారు. ముందుగా నాట్లు వేసిన రైతుల పొలాలు కోతకు రావడంతో గద్దల్లా వాలుతున్నారు. ప్రభుత్వం క్వింటాల్‌కు రూ.2203 మద్దతు ధర ప్రకటిస్తే.. దళారులు మాత్రం రూ.1800 నిర్ణయించారు. ఈ లెక్కన క్వింటాల్‌కు రూ.403 నష్టపోతున్నారు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించకపోవడంతో పంట కోస్తున్న రైతులు చేసేదేమి లేక దళారులకే విక్రయిస్తూ నష్టపోతున్నారు.

ప్రారంభంకాని కొనుగోలు కేంద్రాలు

వానాకాలం(ఖరీఫ్) సీజన్ వడ్లను కొనుగోలు చేసేందుకు పౌరసరఫరాల అధికారులు జిల్లాలో 258 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని ప్రణాళిక సిద్ధం చేశారు. ఐకేపీ 46, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల పరిధి(పీఏసీఎస్)లో 196, డీసీఎంఎస్ పరిధిలో 12, మెప్మా ఆధ్వర్యంలో 4 కేంద్రాలను అక్టోబర్ నెలాఖరులోగా ప్రారంభించాలని నిర్ణయించారు. మే నెలాఖరులో రోహిణి కార్తెలో నారు(తుకాలు) పోసి, జూన్ నెలాఖరులో నాట్లు వేసిన రైతుల పొలాలు ఇప్పుడు కోతకు వచ్చాయి. దీంతో ఆ వడ్లను కొనేందుకు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు లేక రైతులు దళారులకు తక్కువ ధరకే అమ్ముకోవాల్సి వస్తోంది.

3.76 లక్షల మెట్రిక్ టన్నులు లక్ష్యం

జిల్లా వ్యాప్తంగా వానాకాలంలో వరి సాగు పెరిగింది. నీరు సమృద్ధిగా ఉండడంతో జిల్లాలో 1.62 లక్షల ఎకరాల్లో వరిపంట వేశారు. ఈ వానాకాలం సీజన్‌లో 3.76 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేశారు. ఈమేరకు గన్నీసంచులను, ప్యాడీ క్లీనర్లను, తేమ కొలిచే యంత్రాలను సిద్ధం చేస్తున్నారు. గతేడాది వడ్ల ధర క్వింటాల్‌కు రూ.2,060 ఉండగా.. ఈ ఏడాది రూ.143 పెంచారు. దీంతో క్వింటాల్ రూ.2203కు చేరింది. సాధారణ రకం ధర రూ.2183గా నిర్ణయించారు. ధాన్యం విక్రయించిన సమయంలో రైతులు ఆధార్‌కార్డు ఇవ్వాల్సి ఉంటుంది. ఆధార్‌కార్డు లేని వారు బ్యాంకు ఖాతా బుక్, డ్రైవింగ్ లైసెన్స్ లాంటివి ఇవ్వాల్సి ఉంటుంది. ధాన్యం కొనుగోళ్లలో దళారుల ప్రమేయాన్ని కట్టడి చేసేందుకే ఈ విధానాన్ని అమలు చేస్తున్నారు.

అనివార్యంగా విక్రయాలు

రైతుల శ్రమఫలాన్ని దళారులు సొమ్ము చేసుకుంటున్నారు. బాయిల్డ్ రైస్‌మిల్లులకు పచ్చి వడ్లు మరపట్టేందుకు అక్కరకు రావడంతో రైతులు కోసి ధాన్యాన్ని నేరుగా తక్కువ ధరకే కొనుగోలు చేస్తున్నారు. ప్రభుత్వం మద్దతు ధర రూ.2,203 ఉండగా.. రూ.1,600 నుంచి రూ.1,800 చెల్లిస్తూ వడ్లను దళారులు కొంటున్నారు. క్వింటాలుపై రూ.600 నుంచి రూ.400 వరకు దోపిడీ చేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాల్సిన అవసరం ఉంది.

ఈ నెలాఖరులో ప్రారంభిస్తాం



వానాకాలం వడ్ల కొనుగోళ్లకు ప్రణాళిక సిద్ధం చేశాం. గతేడాది తరహాలోనే అన్ని ప్రాంతాల్లోనూ 258 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తాం. ప్రభుత్వం ఈసారి వడ్లకు మద్దతు ధర పెంచింది. క్వింటాల్‌కు రూ.2203గా 'ఏ' గ్రేడ్‌కు, రూ.2183గా కామన్ రకానికి చెల్లిస్తున్నారు. రైతులు తొందరపడకుండా కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం అమ్ముకోవాలి.

– సింగిరెడ్డి జితేందర్‌రెడ్డి, డీఎస్‌వో

ఫలిస్తున్న పేదింటి ఆశలు

- 588 మందికి దరి చేరనున్న గూడు
- పెద్దూరు, రగుడు వద్ద డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పంపిణీ
- 561 మంది ఎస్సీ లబ్ధిదారులకు రూ.14.61 కోట్ల పంపిణీ
- నేడు పంపిణీ చేయనున్న మంత్రి కేటీఆర్



పెద్దూరు శివారులోని డబుల్ బెడ్రూం ఇళ్లు

సిరిసిల్ల: సొంతిల్లు.. ఎవరికైనా జీవితంలో ఓ అందమైన కల.. అదే నిరుపేదలకైతే.. జీవితకాల స్వప్నం. అలాంటి సొంతింటి కలలు జిల్లాలో సాకారమవుతున్నాయి. పెద్దూరు వద్ద 516 డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను, రగుడు వద్ద నిర్మించిన మరో 72 ఇళ్లను రాష్ట్ర మంత్రి కె.తారక రామారావు పేదలకు పంపిణీ చేయనున్నారు. సిరిసిల్ల, రగుడు, పెద్దూరులోని పేదలకు ఏకకాలంలో 588 డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు దరిచేరుతున్నాయి. మరోవైపు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కోసం అన్ని అర్హతలు ఉన్నా.. దురదృష్టవశాత్తు డ్రాలో పేరు రాని పేదలకు ఇళ్ల నిర్మాణానికి స్థలం కేటాయించాలని, గృహలక్ష్మి పథకంలో రూ.3 లక్షలు మంజూరు చేయాలని మంత్రి కేటీఆర్ నిర్ణయించారు. ఈమేరకు పట్టణంలోని 747 మందికి ప్రభుత్వ స్థలాలను పట్టాల రూపంలో మంత్రి బుధవారం అందిస్తున్నారు. మండెపల్లి డబుల్ బెడ్‌రూమ్ కాలనీ సమీపంలోనే పేదలకు ఇంటి స్థలం పట్టాలు అందించనున్నారు.

561 మందికి రూ.14.61 కోట్ల పంపిణీ

ఎస్సీ కార్పొరేషన్ ద్వారా 561 మంది లబ్ధిదారులకు రూ.14.61కోట్లను మంత్రి కేటీఆర్ పంపిణీ చేయనున్నారు. ఈమేరకు జిల్లాలో ఎంపికైన ఎస్సీ లబ్ధిదారులకు ఆర్థిక సాయం అందించేందుకు ఏర్పాట్లు చేశారు. ధర్మపురి నుంచి మంత్రి కేటీఆర్ హెలీకాప్టర్‌లో సిరిసిల్ల వస్తున్నారు. సిరిసిల్లలో మంత్రి కేటీఆర్ పాల్గొనే బహిరంగ సభకు ఏర్పాట్లు చేస్తున్నారు.

మంత్రి కేటీఆర్ పర్యటనపై కలెక్టర్ సమీక్ష

కలెక్టర్ అనురాగ్ జయంతి సోమవారం సాయంత్రం మంత్రి కేటీఆర్ పాల్గొనే కార్యక్రమాలపై ఆయా శాఖల అధికారులతో సమీక్షించారు. మంత్రి కేటీఆర్ పాల్గొనే బహిరంగ సభతోపాటు పట్టాల పంపిణీ, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పంపిణీ, ఎస్సీ లబ్ధిదారులకు ఆర్థికసాయం అందించే కార్యక్రమాలపై సమీక్షించారు.

నేడు మంత్రి కేటీఆర్ రాక

రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, మున్సిపల్‌శాఖ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.తారక రామారావు మంగళవారం సిరిసిల్లకు వస్తున్నట్లు మంత్రి వ్యక్తిగత సహాయకుడు మహేందర్‌రెడ్డి తెలిపారు. కలెక్టరేట్‌లో మధ్యాహ్నం 3.30 గంటలకు జరిగే డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పంపిణీ, ఇంటి స్థలాల పట్టాల పంపిణీ, ఎస్సీ కార్పొరేషన్ లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ, గృహలక్ష్మి లబ్ధిదారులకు మంజూరుపత్రాలు అందజేసి, బహిరంగ సభలో మాట్లాడుతారు. 5.30 గంటలకు హెలీకాప్టర్ హైదరాబాద్ వెళ్తారు.

రాజన్న సన్నిధి.. భక్తజన పెన్నిది





వేములవాడ: రాజన్నను సోమవారం 30 వేల మంది భక్తులు దర్శించుకున్నారు. రద్దీ పెరిగిపోవడంతో దర్శనానికి సుమారు మూడు గంటల సమయం పట్టింది. కొందరు టికెట్లను రీసేల్ చేస్తున్నట్లు భక్తులు ఆరోపించారు. మహబూబాబాద్ ఎంపీ మాలోత్ కవిత, ఆధ్యాత్మిక ప్రవచనకర్త చాగంటి కోటేశ్వర్‌రావు వేర్వేరుగా రాజన్నను సోమవారం దర్శించుకున్నారు. కుటుంబ సమేతంగా వచ్చిన చాగంటికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన అవకాశం కల్పించారు. అనంతరం వేదోక్త ఆశీర్వచనం గావించారు.

శ్రమైక జీవనం

- పట్టుదలతో దరి చేరిన ఉపాధి
- పొద్దు.. మాపు శ్రమిస్తూ.. బతుకుదెరువు
- ఇది చీర్లవంచ నిర్వాసితుడి బతుకుచిత్రం



మిల్లెట్ హోటల్‌లో దోశలు వేస్తున్న గణేశ్

పుట్టి పెరిగిన పల్లె.. జ్ఞాపకాల ముల్లె ఊరు మునిగింది.. ఉపాధి పోయింది. వందల ఏళ్లుగా కలిసి ఉన్న ఆ పల్లెలు చెదిరిపోయాయి'... ఇది మధ్యమానేరు జలాశయంలో ముంపునకు గురైన పల్లెల వ్యథ. మిడ్‌మానేరులో మునిగిపోయిన పల్లెల్లో ఒక్కొక్కరిది ఒక్కో గాథ. మిడ్‌మానేరు నిర్వాసితులు ఉపాధి లేక దిక్కులు చూస్తున్నారు. భూములు మునిగిపోయి.. వ్యవసాయం జలసమాధి అయ్యింది. ఇళ్లు శిథిలమయ్యాయి. ఉపాధి లేక దిక్కులు చూసే వారికి ఆ నిర్వాసితుడి శ్రమైక జీవనం స్ఫూర్తిగా నిలుస్తోంది. పట్టుదలగా శ్రమిస్తే బతుకుదెరువు దరి చేరుతుందని నిరూపిస్తున్నాడు.. తంగళ్లపల్లి మండలం చీర్లవంచకు చెందిన బీమరి గణేశ్. – సిరిసిల్ల

మిడ్‌మానేరులో మునిగిన గ్రామం

గణేశ్‌కు చీర్లవంచలో రెండున్నర ఎకరాల భూమి ఉండగా.. వ్యవసాయ చేస్తూ.. బస్టాండులో హోటల్ నడుపుతూ జీవనం సాగించాడు. నిత్యం హోటల్‌లో రూ.5వేల నుంచి రూ.6వేల గిరాకీ అయ్యేది. ఖర్చులు పోను కొంత మిగిలేది. అంతా సాఫీగా సాగుతున్న తరుణంలో మధ్యమానేరు జలాశయం నిర్మించడంతో చీర్లవంచ మునిగిపోయింది. అందరిలాగే గణేశ్‌కు ప్రభుత్వం ద్వారా పరిహారం, పునరావాసం దక్కింది. వేములవాడఅర్బన్ మండలం చంద్రగిరిలో ఇల్లు స్థలం ఇచ్చారు. కానీ ఇంత కాలం ఉపాధినిచ్చిన హోటల్ మునిగిపోయింది. బతుకుదెరువు దూరమైంది. కుటుంబ పోషణ కోసం బతుదెరువు అన్వేషించాడు.

రెండు షిఫ్ట్‌ల్లో శ్రమిస్తూ..

గణేశ్ సిరిసిల్లలో భార్య, పిల్లలతో అద్దెకు ఉంటూ రెండు షిఫ్ట్‌ల్లో శ్రమిస్తున్నాడు. జిల్లా కేంద్రంలోని కూరగాయల మార్కెట్ వెనక వైపు ఉన్న మిల్లెట్ సెంటర్(హోటల్)లో ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పనిచేస్తాడు. అక్కడ నిత్యం ఆరు గంటలు పని చేస్తే రూ.500 ఇస్తున్నారు. మళ్లీ సాయంత్రం పూట వేములవాడ శివారులోని దాబా హోటల్‌లో పనిచేస్తున్నాడు. ఇక్కడ సాయంత్రం 5 నుంచి రాత్రి 11 గంటల వరకు పనిచేస్తాడు. ఇలా పనిచేయడం ద్వారా గణేశ్‌కు మరో రూ.500 కూలి లభిస్తుంది. రోజూ రెండు చోట్ల ఆరుగంటల చొప్పున పనిచేస్తూ రూ.వెయ్యి సంపాదిస్తున్నాడు. మధ్యాహ్నం సమయంలో ఇంటికి వెళ్లి ఓ రెండు గంటల పాటు రెస్ట్ తీసుకుంటున్నాడు. ఇలా నిత్యం రెండు వేర్వేరు ప్రాంతాల్లో పని చేస్తూ నెలకు సగటున రూ.25వేల నుంచి రూ.30వేల వరకు సంపాదిస్తున్నాడు. పనిచేయని రోజు మాత్రం కూలి లభించదు. అందుకే నిత్యం సమయానుకూలంగా పనిచేసేందుకు గణేశ్ ప్రణాళిక సిద్ధం చేసుకుంటాడు. మధ్యమానేరు నిర్వాసితుడిగా నిరాశకు గురికాకుండా ఆశతో శ్రమైక జీవనం సాగిస్తున్నాడు.

పిల్లలు చదువుకుంటున్నారు

మా ఊరు చీర్లవంచలో హోటల్ నడిపిన. ఏడో తరగతిలోనే చదువు ఆపిన. మధ్యమానేరులో మా ఊరు మునిగిపోయింది. కుటుంబాన్ని పోషించేందుకు రెండు చోట్ల పనిచేస్తున్న. కొంచం కష్టమే అయినా తప్పదు. బతుకుదెరువు కోసం ఏదో ఒక్క పనిచేయాల్సిందే. నా భార్య సంధ్య, కూతురు సుధా, కొడుకు మణికంఠ ఉన్నారు. పిల్లలు చదువుకుంటున్నారు.

– బీమరి గణేశ్, నిర్వాసితుడు

ఆత్మగౌరవంగా అంతిమయాత్ర

- వైకుంఠరథానికి విరాళాల సేకరణ
- బాధిత కుటుంబాలకు తప్పనున్న కష్టాలు
- నాలుగు రోజుల్లో రూ.2.50 లక్షలు జమ
- ఆదర్శం బండలింగంపల్లి గ్రామస్తులు



విరాళాలు సేకరిస్తున్న గ్రామస్తులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): అంతిమయాత్రను గౌరవంగా నిర్వహించేందుకు గ్రామస్తులు ఏకమయ్యారు. పాడె మోసేందుకు ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో వైకుంఠరథం కొనేందుకు విరాళాలు సేకరిస్తున్నారు. ఇటీవల ఒకరు మృతిచెందగా.. వైకుంఠరథం అందుబాటులో లేకపోగా.. పాడే మోసేందుకు జనం లేక పంచాయతీ ట్రాక్టర్‌లో శ్మశానవాటికకు తరలించడం గ్రామస్తులను కలచివేసింది. ఇక నుంచి గ్రామంలో ఎవరికీ ఇలాంటి అనుభవం ఎదురుకావొద్దని స్వచ్ఛందంగా విరాళాలు అందిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు ఎల్లారెడ్డిపేట మండలంలోని బండలింగంపల్లి గ్రామస్తులు.

అంతిమయాత్రకు అవస్థలెన్నో..

ఎల్లారెడ్డిపేట మండలం మొత్తంమీద రెండు మాత్రమే వైకుంఠరథాలు ఉన్నాయి. మండలంలోని 24 గ్రామాల పరిధిలో ఒకే రోజు నలుగురైదుగురు చనిపోతే బలగం లేని వారికి వైకుంఠరథం లేక వారు పడుతున్న బాధలు వర్ణనాతీతం. ఇలాంటి సమస్య అన్ని గ్రామాల్లో ఉంది. చనిపోయిన వారికి చివరిగా నిర్వహించే దహన సంస్కారాలకు సకాలంలో చితివద్దకు చేర్చడానికి అనేక అవస్థలు పడుతున్నారు. ఇలాంటి స్థితిలో బండలింగంపల్లి గ్రామస్తులు వైకుంఠరథం కొనుగోలు చేయాలని నిర్ణయం తీసుకుని ఆదర్శంగా నిలిచారు.

రూ.2.50 లక్షల విరాళాలు

ఎల్లారెడ్డిపేట మండలం బండలింగంపల్లిలో వైకుంఠరథం లేకపోవడంతో బంధువులు, బలగం లేని కుటుంబాలు మృతదేహాలను మైళ్ల దూరం మోసుకెళ్లలేక అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో వైకుంఠరథం కొనుగోలుకు గ్రామంలోని ఉద్యోగులు, ఆర్థికంగా ఉన్న వారి నుంచి విరాళాలు సేకరించాలని నిర్ణయించారు. ఈ విషయాన్ని గ్రామంలో ప్రచారం చేయడంతో దాతలు పెద్ద ఎత్తున ముందుకొచ్చి తమ వంతు సాయం అందిస్తున్నారు. నాలుగు రోజుల్లో సుమారు రూ.2.50 లక్షల వరకు విరాళాలు అందాయి. ఆదర్శంగా నిలిచిన బండలింగంపల్లి గ్రామస్తులను పలువురు అభినందిస్తున్నారు.

గాంధీమార్గం అనుసరణీయం

- ఎస్పీ అఖిల్ మహాజన్



నివాళి అర్పిస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్



గాంధీ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న నాయకులు

సిరిసిల్లక్రైం: మహాత్మాగాంధీ మార్గం ప్రతి ఒక్కరికి అనుసరణీయమని ఎస్పీ అఖిల్ మహాజన్ పేర్కొన్నారు. గాంధీ జయంతి సందర్భంగా జిల్లా పోలీస్ కార్యాలయంలో మహాత్మాగాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. శాంతియుత మార్గంలో ముందుకుసాగి దేశానికి స్వాతంత్ర్యం తీసుకొచ్చిన మహనీయుడని కొనియాడారు. డీఎస్పీ రవికుమార్, సిరిసిల్లటౌన్ సీఐ ఉపేందర్, ఆర్ఐ యాదగిరి, రమేశ్ పాల్గొన్నారు.

సిరిసిల్ల: జాతిపిత మహాత్మాగాంధీ ఆదర్శప్రాయుడని, ఆయన అడుగుజాడల్లో అందరూ నడవాలని సిరిసిల్ల ఆర్డీవో ఎస్.ఆనంద్‌కుమార్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం మహాత్మాగాంధీ జయంతి వేడుకలు నిర్వహించారు. డీపీఆర్వో మామిండ్ల దశరథం, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు. జిల్లా కేంద్రంలోని గాంధీ విగ్రహానికి బీఆర్ఎస్ నాయకులు, మున్సిపల్ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళి అర్పించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళా చక్రపాణి, సెస్ చైర్మన్ చిక్కాల రామారావు, టీఎస్‌టీడీసీ చైర్మన్ ప్రవీణ్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.



కలెక్టరేట్‌లో గాంధీ జయంతి వేడుకలు

క్లుప్తంగా

సైన్స్‌ఫెయిర్‌లో సత్తాచాటిన విద్యార్థి



వేములవాడఅర్బన్: పట్టణంలోని శిశుమందిర్ పాఠశాల విద్యార్థి అజిత్‌కుమార్ రెండు రోజులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విజయవాడలో నిర్వహించిన సైన్స్‌ఫెయిర్‌లో పాల్గొని ప్రతిభ చాటారు. ఈ సైన్స్‌ఫేర్‌లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల విద్యార్థులు పాల్గొన్నారు. తెలంగాణ హైస్కూల్ తరఫున మ్యాథ్స్ మోడల్స్‌లో అజిత్‌కుమారప్రాతినిధ్యం వహార్చారు. అజిత్‌కుమార్ బహుమతి సాధించినట్లు గైడ్ టీచర్ చందు, ఉమా తెలిపారు.

'ఎన్నికలు డబ్బుతో కూడుకున్నాయి'



వేములవాడ: ప్రస్తుతం ఎన్నికలు డబ్బుతో కూడుకుంటున్నాయని ఆర్టీసీ మాజీ చైర్మన్ గోనె ప్రకాశ్‌రావు పేర్కొన్నారు. స్థానిక వెలమ సంక్షేమ సంఘం గెస్ట్ హౌస్‌లో సోమవారం విలేకరులతో మాట్లాడారు. రాజకీయాల్లోకి సేవాభావంతో రావాలే తప్ప.. వ్యాపార దృక్పథంతో రావొద్దని కోరారు. వేములవాడ నియోజకవర్గంలో పోటీ చేసే అభ్యర్థులు ఆది శ్రీనివాస్ తనకు అత్యంత సన్నిహితుడని, బీసీ నాయకుడనీ, బీజేపీ నుంచి టికెట్ ఆశిస్తున్న వికాస్‌రావు సేవాభావంతో ఈసారి ఎన్నికల్లో పోటీచేసేందుకు ముందుకొస్తున్నారన్నారు. ప్రజలు తమ నాయకుడిని ఆచితూచి ఎన్నుకోవాలని సూచించారు.

'నిధుల విషయం లీకేజీతో సంబంధం లేదు'

వేములవాడ: రాజన్న నిధులను కామారెడ్డి నియోజకవర్గంలోని ఆలయాలకు కేటాయించాలన్న జీవో వివరాల లీకేజీకి తనకు ఎలాంటి సంబంధం లేదని రాజన్న ఆలయ సీనియర్ అసిస్టెంట్ ఉపాధ్యాయుల చంద్రశేఖర్ పేర్కొన్నారు. కావాలని కొందరు ఉద్దేశపూర్వకంగానే సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్నారన్నారు. ఈ వ్యవహారాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు.

జాతీయ నేతలకు బీజేపీ నివాళి



సిరిసిల్లకల్చరల్: జాతిపిత మహాత్మాగాంధీ, మాజీ ప్రధాని లాల్‌బహదూర్‌శాస్త్రీ జయంతి సందర్భంగా బీజేపీ పట్టణ నాయకులు సోమవారం నివాళి అర్పించారు. గాంధీసర్కిల్‌లో ఏర్పాటుచేసిన చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ఆడెపు రవీందర్, పార్టీ నేతలు నాగుల శ్రీనివాస్, శీలం రాజు, అహ్మద్, నరేశ్, శ్రీగాద మైసయ్య, వేముల పోశెట్టి, సుంకోజు రమేశ్, పోతు శ్రీనివాస్, చొప్పదండి అంజన్న, శ్రీనివాస్, గుడ్ల విష్ణు, ద్యావనపల్లి భాస్కర్, వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

హత్యలు.. దొంగతనాలు

- అటవీ గ్రామాల్లో ఆందోళనకర పరిస్థితి
- ప్రతీకారం, పగలతో ప్రాణాలు తీస్తున్నారు
- పట్టపగలే దొంగతనాలు
- వరుస సంఘటనలతో వణికిపోతున్న జనం



చందుర్తిలో ఇటీవల హత్యకు గురైన గంగారం మృతదేహం.. పరిశీలిస్తున్న పోలీసులు

చందుర్తి(వేములవాడ): పగలు.. ప్రతీకారాలతో ప్రాణాలు తీస్తున్నారు. క్షణికావేశాలతో నేరాలు చేసి జైలు పాలవుతున్నారు. వేములవాడ నియోజకవర్గంలో అటవీ మండలాలైన చందుర్తి, రుద్రంగి ఏరియాలో వరుస హత్యలు.. దొంగతనాలతో జనం భయాందోళన చెందుతున్నారు. క్షణికావేశంలో చేస్తున్న తప్పులకు కుటుంబాలు చిన్నాభిన్నమవుతున్నాయి. తొమ్మిది నెలల్లో చందుర్తి మండలంలోనే ఐదు హత్యలు జరిగాయి. పగలు, ప్రతీకారంతోనే చంపుకున్నారు. మరో వైపు దొంగతనాలు ఆందోళనకు గురిచేస్తున్నాయి. పట్టపగలే ఇళ్లను లూటీ చేస్తున్నారు.

దడపుట్టిస్తున్న ప్రతీకార హత్యలు

చందుర్తి మండలంలోని పలు గ్రామాల్లో జరిగిన హత్యల వెనుక పగలు, ప్రతీకారాలే ఉన్నాయి. తొమ్మిది నెలల్లో జరిగిన హత్యలను పరిశీలిస్తే ఇదే అర్థమవుతుంది. రెండు హత్యలు బండరాళ్లతో మోది చంపగా, మరో ఇద్దరిని వేటాడే కత్తులతో నరికారు. మరో హత్య గొడ్డళ్లతోనే నరికి చంపారు. వరుస సంఘటనలతో జనం భయంభయంగా బతుకుతున్నారు.

హత్యలు ఇలా..

- చందుర్తి మండలం జోగాపూర్‌కు చెందిన గొల్లపల్లి లింగవ్వను 2022 డిసెంబర్ 26న అర్ధరాత్రి తాగిన మైకంలో అదే గ్రా మానికి చెందిన శ్రీకాంత్ హత్యచేశాడు. ఈ హత్య కు అదే గ్రామానికి చెందిన మర్డర్ శంకరయ్య ప్రమేయం ఉందని భా వించి జనవరి 21న లింగవ్వ కుమారుడు మధుసాగర్ మరో ముగ్గురితో కలిసి కత్తితో నరికి చంపారు. ఈ రెండు హత్యలతో మూడు కుటుంబాలు చిన్నభిన్నామయ్యాయి.
- ఫిబ్రవరి 7న రుద్రంగికి చెందిన రణవేని గణేశ్‌ను భార్య, అత్తింటివారు గొడ్డలితో నరికి చంపారు.
- సెప్టెంబర్ 13న మల్యాల గ్రామానికి చెందిన పడిగెల నరేశ్‌ను అదే గ్రామానికి చెందిన మల్లేశం కొత్తితో దాడి చేసి చంపాడు. నరేశ్ తన భార్యతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడనే హత్యకు పాల్పడ్డాడు.
- సెప్టెంబర్ 27న చందుర్తిలో పులి గంగారం (58)ను అదే గ్రామానికి చెందిన మైనర్ బాలుడు బండరాయితో మోది హత్య చేశాడు.
- 2019, జనవరి 8న నర్సింగాపూర్‌కు చెందిన మెరుపుల హరీశ్‌ను అదే గ్రామానికి చెందిన వ్యక్తి హత్య చేశాడు.
- 2020లో ఆగస్టు 2న నర్సింగాపూర్‌లో బైరగోని తిరుపతిని భూతగదాలతో మూడపల్లికి చెందిన వ్యక్తి హతమార్చారు.

వరుస దొంగతనాలతో బెంబేలు

- సెప్టెంబర్ 14న చందుర్తి మండలం మూడపల్లి అనుబంధ గ్రామం గోస్కులపల్లెలో రెండిళ్లలో పట్టపగలే చొరబడి 7 తులాల బంగారు నగలు, వెండి వస్తువులను ఎత్తుకెళ్లారు.
- సెప్టెంబర్ 23న మల్యాలలో దేశెట్టి రాజయ్య ఇంట్లో చొరబడి 7 తులాల బంగారం నగలు ఎత్తుకెళ్లారు.
- ఈనెల 28న నర్సింగపూర్‌కు చెందిన బైరగోని దేవేంద్ర కరీంనగర్‌లో ఉంటున్న తన కూతురు ఇంటికి వెళ్లిందని గుర్తించిన ఇంటి తాళం పగులగొట్టి రూ.15వేల నగదు, 20 తులాల వెండి నగలను ఎత్తుకెళ్లారు.

నిఘా నిస్తేజం

- ప్రైవేట్ లాడ్జీల్లో అసాంఘిక కార్యకలాపాలు
- నియంత్రణ కరువు



వేములవాడలో సీసీ కెమెరాలు కనపించని ప్రైవేట్ లాడ్జీలకాలనీ

వేములవాడ: వేములవాడ లాడ్జీలు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాలుగా మారుతున్నాయి. పైసల సంపాదనే ధ్యేయంగా నిబంధనలు బేఖాతరు చేస్తున్నారు. ఇతర ప్రాంతాల నుంచి వస్తున్న వ్యక్తులు హత్యలకు గురవుతున్నా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం లేదు. లాడ్జీల్లో ఉంటున్న వారి చిరునామాలు సేకరించడం లేదు. సరైన నిబంధనలు పాటించకపోతుండడంతో ఇతర ప్రాంతాల నుంచి వస్తున్న వారు తమ వ్యవహారాలను యథేచ్ఛగా కొనసాగిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. వేమువాడలో దాదాపు 200 వరకు ప్రైవేట్ లాడ్జీలు ఉన్నాయి.

సీసీ కెమెరాల జాడే లేదు

వేములవాడలోని ప్రైవేట్ లాడ్జీల్లో సీసీ కెమెరాలు బిగించడం లేదు. లాడ్జీలు ఉన్న కాలనీల్లోనూ సీసీ కెమెరాలు లేవు. అడపాదడపా ప్రైవేట్ లాడ్జీల యజమానులతో పోలీసులు సమావేశాలు నిర్వహించి సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలనీ, ఐడీకార్డులు లేకుండా గదులు అద్దెకు ఇవ్వొద్దని సూచిస్తున్నప్పటికీ అమలు కావడం లేదు. అక్రమ సంపాదనకు అలవాటుపడ్డ లాడ్జీల యజమానులు నిబంధనలు పాటించడం లేదు.

నిబంధనలు ఇవీ..

- నిత్యం వంద మంది వరకు తెరిగి ప్రాంతంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి. వీటిని సీఐ, డీఎస్పీ స్థాయి అధికారి సంబంధిత ఓనర్ అనుమతితో తనిఖీ చేసే అధికారం ఉంటుంది. తప్పకుండా నెల రోజుల రికార్డింగ్ స్టోరేజీ ఉంచుకోవాలి.



కేసులు నమోదు చేస్తాం

నిబంధనలు పాటించని లాడ్జీల యజమానులపై కేసులు నమోదు చేస్తాం. అన్ని లాడ్జీల యజమానులు, దుకాణాల యజమానులు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి. ప్రజల భద్రత కోసమే చట్టాలు ఉన్నాయి. పోలీసులకు ప్రజలు సహకరించాలి.

– నాగేంద్రచారి, డీఎస్పీ

జీవితాలు నాశనం చేసుకోవద్దు

పగలు. ప్రతీకారాలతో జీవితాలను నాశనం చేసుకోవద్దు. ప్రతీ సమస్యను శాంతియుతంగా ప రిష్కరించుకునే అవకాశాలు ఉన్నాయి. చిన్నచిన్న సమస్యలతో కక్షలు పెంచుకుని నూరేళ్ల జీవితాలు బుగ్గిపాలు చేసుకోవద్దు. గ్రామాల్లో అపరిచితులు సంచరిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలి.

– అచ్చ కిరణ్‌కుమార్, సీఐ, చందుర్తి



ఆత్మగౌరవ భవన స్థలాన్ని మార్చండి



వినోద్‌కుమార్‌ను సన్మానిస్తున్న అక్కరాజు శ్రీనివాస్

సిరిసిల్ల: హైదరాబాద్‌లోని మేడిపల్లిలో రజక ఆత్మగౌరవ సంఘ భవనానికి కేటాయించిన స్థలాన్ని ఉప్పల్ భగాయత్‌కు మార్చాలని రజక సంఘాల రాష్ట్ర అధ్యక్షుడు అక్కరాజు శ్రీనివాస్ ప్రణాళిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్‌ను కోరారు. కరీంనగర్‌లోని వినోద్‌కుమార్ ఇంటికి సోమవారం వెళ్లి.. ఈమేరకు విన్నవించారు. మేడిపల్లిలో కేటాయించిన రెండెకరాల స్థలం భవన నిర్మాణానికి అనువుగా లేదని, ఉప్పల్ భగాయత్ ప్రాంతంలో స్థలం కేటాయించాలని కోరారు. సీఎం కేసీఆర్‌తో మాట్లాడి స్థలం కేటాయింపులు చేయిస్తానని హామీ ఇచ్చారు. రజక సంఘం నాయకులు కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

ర్యాలీలు.. విన్నపాలు



సంఘీభావం తెలుపుతున్న మహేందర్‌రెడ్డి

సిరిసిల్లటౌన్: ఆశవర్కర్లకు రూ.18వేలు వేతనం చెల్లించాలని కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గం ఇన్‌చార్జి మహేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆశల సమ్మెకు సోమవారం సంఘీభావం తెలిపి మాట్లాడారు. పనికి తగిన వేతనం ఇవ్వాలని కోరారు. మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు కాముని వనిత, చొప్పదండి ప్రకాశ్, సంగీతం శ్రీనివాస్, ఆకునూరి బాలరాజు, వెల్మల స్వరూప, గోనె ఎల్లప్ప ఉన్నారు. అనంతరం ఆశవర్కర్లు గాంధీవిగ్రహానికి వినతిపత్రం అందించారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కోడం రమణ, అన్నల్‌దాస్ గణేశ్, ఆశవర్కర్ల యూనియన్ జిల్లా అధ్యక్షురాలు బదవేణి మంజుల, ప్రధాన కార్యదర్శి జయశీల, చంద్రకళ, లత, రాణి, లావణ్య ఉన్నారు.

భక్తిభావం వెల్లివిరిసేలా పూజలుండాలి

- ఈవో కృష్ణప్రసాద్
- వేములవాడలో కొనసాగుతున్న అర్చకుల పునశ్చరణ తరగతులు



ధూపదీప నైవేద్య అర్చకుల పునశ్చరణ తరగతుల్లో మాట్లాడుతున్న ఈవో కృష్ణప్రసాద్

వేములవాడ: ధూపదీప నైవేద్య ఆలయాల్లో ఆధ్యాత్మికత, భక్తిభావం వెల్లివిరిసేలా అర్చకులు కృషిచేయాలని రాజన్న ఆలయ ఈవో కృష్ణప్రసాద్ కోరారు. ఆలయ ఆవరణలో కొనసాగుతున్న రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయశాఖ ఆధ్వర్యంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా అర్చక ఆగమ పునశ్చరణ శిక్షణ తరగతులలో సోమవారం మాట్లాడారు. ఏఈవో హరికిషన్, ఆంజనేయస్వామి దేవస్థానం కొండగట్టు అర్చకులు కపీందర్, జితేంద్రప్రసాద్, మారుతి, చిరంజీవస్వామి, సహాయ కమిషనర్ కార్యాలయ పరిశీలకులు సత్యనారాయణ, కార్యనిర్వహణాధికారి వెంకన్న, శ్రీనివాస్ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

గుండెపోటుతో యువకుని మృతి



మానుపాటి హరికృష్ణ (ఫైల్)

వేములవాడరూరల్: వేములవాడ మండలం చెక్కపల్లికి చెందిన మానుపాటి హరికృష్ణ (20) సోమవారం గుండెపోటుతో మృతిచెందినట్లు గ్రామస్తులు తెలిపారు. మానుపాటి రాజయ్య–దేవవ్వలకు ఒక్కగానొక్క కుమారుడు హరికృష్ణ. గల్ఫ్ దేశానికి వెళి నెల రోజుల క్రితమే వచ్చాడు. సిరిసిల్లలోని బంధువుల నూతన గృహనిర్మాణ పనులు చూసుకుంటున్న హరికృష్ణకు హఠాత్తుగా గుండెపోటు రావడంతో ఆస్పత్రికి తరలిస్తుండగా మృతిచెందినట్లు తెలిపారు.

మీడియా కమిషన్ ఏర్పాటు చేయండి

- జర్నలిస్టులకు రైల్వేపాస్ పునరుద్ధరించాలి
- టీయూడబ్ల్యూజే ఐజేయూ జిల్లా అధ్యక్షుడు సంతోష్‌కుమార్
- గాంధీచౌక్‌లో నిరసన.. జాతిపితకు నివాళి



గాంధీచౌక్‌లో జర్నలిస్టుల నిరసన జాతిపితకు నివాళి

సిరిసిల్లటౌన్: జర్నలిస్టుల రక్షణ చట్టాన్ని అమలు చేసి వెంటనే మీడియా కమిషన్ ఏర్పాటు చేయాలని టీయూడబ్ల్యూజే ఐజేయూ జిల్లా అధ్యక్షుడు దండి సంతోష్‌కుమార్ డిమాండ్ చేశారు. అక్టోబర్ 2 జర్నలిస్టుల డిమాండ్స్ డే సందర్భంగా జిల్లా కేంద్రంలోని గాంధీచౌక్‌లో నిరసన తెలిపి మాట్లాడారు. నిజాలను నిర్భయంగా రాస్తున్న జర్నలిస్టులపై దేశవ్యాప్తంగా దాడులు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. దాడులు, బెదిరింపు నేపథ్యంలో ప్రభుత్వం మీడియా చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. జాతీయస్థాయిలో చీఫ్ జస్టిస్ ఆధ్వర్యంలో, జిల్లా స్థాయిలో రిటైర్డ్ జిల్లా జడ్జి ఆధ్వర్యంలో మీడియా కమిషన్ ఏర్పాటు చేసి పత్రికాస్వేచ్ఛను కాపాడాలని, గుర్తింపు పొందిన జర్నలిస్టులకు రైల్వేపాసులు పునరుద్ధరించాలని కోరారు. గాంధీ జయంతిని పురస్కరించుకుని జాతిపిత మహాత్ముడికి జిల్లా జర్నలిస్టులు నివాళి అర్పించారు. తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టుల సంఘం జిల్లా అధ్యక్షుడు దండి సంతోష్‌కుమార్, కార్యదర్శి కాంబోజి ముత్యం, కోశాధికారి గంగు సతీశ్, సీనియర్ నాయకులు కాయితి బాలు, చిటికెన జగదీశ్, టీవీ నారాయణ, అల్లె రమేశ్, రామ్‌బాబు, కొక్కుల భాస్కర్, ప్రయాకర్‌రావు వేణుకుమార్, రాజేశం, మేఘనాథ్‌రెడ్డి, కిషన్, రాజేంద్రపసాద్, రమణయ్య, రాజు, మురళి, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయిలో జిల్లా విద్యార్థుల ప్రతిభ



పతకాలతో జిల్లా క్రీడాకారులు



బంగారు పతకం సాధించిన విద్యార్థిని రుచిత

సిరిసిల్లఅర్బన్: కరీంనగర్‌లో జరిగిన తెలంగాణ 9వ అథ్లెటిక్స్ జూనియర్ ఛాంపియన్‌షిప్ రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. జిల్లాకు చెందిన పలువురు క్రీడాకారులు 3 గోల్డ్‌మెడల్స్, 3 సిల్వర్‌మెడల్స్, 2 బ్రాంజ్ మెడల్స్ సాధించారు. జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు చిక్కాల రామారావు, ప్రధాన కార్యదర్శి బొజ్జ చంద్రశేఖర్ క్రీడాకారులను అభినందించారు.

టీఎస్‌డబ్ల్యూఆర్ఎస్ విద్యార్థినికి అభినందనలు

తెలంగాణ 9వ అథ్లెటిక్స్ జూనియర్ చాంపియన్‌షిప్ రాష్ట్రస్థాయి పోటీల్లో చిన్నబోనాల తెలంగాణ సాంఘిక సంక్షేమ కళాశాల విద్యార్థిని మామిండ్ల రుచిత అండర్–16లో 80 మీటర్ల హార్డిల్స్‌లో బంగారు పతకం సాధించింది. జాతీయస్థాయికి ఎంపికైన రుచితను కళాశాల ప్రిన్సిపాల్ జాక్వలిన్, ఉపాధ్యాయులు అభినందించారు.

ఉరివేసుకుని వృద్ధురాలు ఆత్మహత్య

సిరిసిల్లక్రైం: మానసికస్థితి సరిగ్గా లేని మహిళ సోమవారం ఆత్మహత్య చేసుకున్న ఘటన జిల్లాకేంద్రంలోని గీతానగర్‌లో విషాదం నింపింది. పోలీసులు తెలిపిన వివరాలు. గీతానగర్‌కు చెందిన చిలువేరి విజయమ్మ(55), భర్త చంద్రయ్య భార్యభర్తలు. చంద్రయ్య సెస్‌లో ఉద్యోగి కాగా, వీరి కుమారుడు హైదరాబాద్‌లో ఉద్యోగం చేస్తున్నాడు. ఇటీవల విజయమ్మ మానసిక పరిస్థితి సరిగ్గా ఉండడం లేదు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో వృద్ధురాలు విజయమ్మ ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. అయితే మృతురాలి కాళ్లు నేలకు తాకి ఉన్నాయని పోలీసులు గమనించారు. ఈ విషయమై సిరిసిల్లటౌన్ సీఐ ఉపేందర్‌ను వివరణ కోరగా ఘటన స్థలాన్ని సందర్శించానని, మరిన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

టిప్పర్ ఢీకొని వ్యక్తి మృతి

- మద్యం మత్తులో టిప్పర్ డ్రైవర్



పాశెం ప్రభాకర్ (ఫైల్)

బోయినపల్లి(చొప్పదండి): అత్తమ్మ ఏడాది మాశికానికి వెళ్లివస్తుండగా మండలంలోని కొదురుపాక పరిసరాల్లో టిప్పర్ ఢీకొని వేములవాడ మండలం సంకెపల్లికి చెందిన పాశెం ప్రభాకర్(52) మృతిచెందాడు. ఎస్సై మహేందర్ తెలిపిన వివరాలు. సంకెపల్లికి చెందిన ప్రభాకర్ ఆదివారం తన అత్తమ్మ సంవత్సరీకం కోసం కాటారం వెళ్లాడు. కరీంనగర్‌లో బైక్ పెట్టి కాటారం బస్సులో వెళ్లాడు. రాత్రి కరీంనగర్ నుంచి సంకెపల్లి వెళ్లేందుకు బైక్‌పై తిరిగి వస్తున్నాడు. ఈక్రమంలో కొత్తపల్లి మండలం బావుపేట వద్ద ఆగి, హోటల్‌లో టిఫిన్ చేస్తున్నట్లు తన సోదరుడికి తెలిపాడు. వర్షం ఆగిన తర్వాత తిరిగి బైక్‌పై వేములవాడ వైపు వస్తుండగా కొదురుపాక పరిసరాల్లో ఎదురుగా వస్తున్న టిప్పర్ అతివేగంగా ఢీకొట్టడంతో ప్రభాకర్ మృతిచెందాడు. ప్రభాకర్ భార్య లావణ్య ఏడేళ్ల క్రితం డెంగీతో మృతిచెందింది. కూతురు అక్షితకు ఇటీవల వివాహమైంది. మద్యం మత్తులో ఉన్న డ్రైవర్ సలీం అతివేగంతో రాంగ్‌రూట్‌లో వచ్చి టిప్పర్‌తో ఢీకొట్టడంతో తన తండ్రి ప్రభాకర్ మృతిచెందినట్లు కుమారుడు అక్షయ్ ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

- బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు బాలాజీ



సమావేశమైన బీజేపీ, బీజేవైఎం నాయకులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): బీజేపీ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలని బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు బాలాజీ కోరారు. ఎల్లారెడ్డిపేటలో సోమవారం మహాత్మాగాంధీ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. బీజేపీ మండలాధ్యక్షుడు పొన్నాల తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో బూత్ కమిటీ సమావేశం నిర్వహించారు. బాలాజీ మాట్లాడుతూ బూత్ స్థాయి నుంచి పార్టీని పటిష్ఠం చేయాలన్నారు. శక్తి కేంద్రం ఇన్‌చార్జీలకు దిశా నిర్దేశం చేశారు. పార్టీ మండలాధ్యక్షుడు తిరుపతిరెడ్డి మాట్లాడుతూ పార్టీ కోసం పనిచేసిన వారికి గుర్తింపు దక్కుతుందని, పదవులు వెతక్కుంటూ వస్తాయన్నారు. జిల్లా ఉపాధ్యక్షుడు గుండాడి వెంకట్‌రెడ్డి, సీనియర్ నాయకులు మద్దుల బుగ్గారెడ్డి, నేవూరి దేవేందర్‌రెడ్డి, కంచర్ల పర్శరాములు, సత్యారెడ్డి, గణేశ్, రవినాయక్, వంగల రాజు, రామచంద్రం, శరత్‌రెడ్డి, జితేందర్‌రెడ్డి, గుమ్మడి స్వామి, భాస్కర్‌రెడ్డి, సత్యంరెడ్డి, సాయి, ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

అడవిపందిని చంపిన ఇద్దరిపై కేసు

వీర్నపల్లి(సిరిసిల్ల): వీర్నపల్లి ఫారెస్ట్ సెక్షన్ పరిధిలో ఓ అడవిపందిని వేటాడి చంపిన ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎఫ్ఎస్‌వో రంజిత్‌కుమార్ తెలిపారు. కోనరావుపేట మండలంలోని కొండాపూర్‌కు చెందిన ఇద్దరు చంపిన పందిని బైక్‌పై తీసుకెళ్తుండగా పట్టుకున్నట్లు చెప్పారు. ఎఫ్ఎస్వో మాట్లాడుతూ అటవీ జంతువులను వేటాడిన, చంపిన చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కాలుష్య గోదావరి



గోదావరిఖని సమీప గోదావరి నదిలో కాలుష్యపు నురగ

గోదావరిఖని: పెద్దపల్లి జిల్లా గోదావరిఖని సమీపంలోని గోదావరినది కాలుష్యంగా మారింది. సోమవారం నీటిలో నురగ కనిపించడంతో నగరవాసులు ఆందోళన చెందుతున్నారు. ఒక తెట్టులా సుమారు కిలోమీటరు పొడవున నదీ నీటిలో నురగ కనిపించింది. సింగరేణి కార్మికవాడలు, నగరవాసులకూ నిత్యం గోదావరినది నుంచే నీటిని సరఫరా చేస్తున్నారు. ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్‌ల్లోని భక్తులు గోదావరి నదిలో పుణ్యస్నానాలు చేస్తూ ఎంతో పవిత్రంగా భావిస్తున్నారు. ఇందులో చేపల పెంపకంపై చాలాకుటుంబాలు ఆధారపడి జీవిస్తున్నాయి. అయితే సోమవారం నీటిలో తేలిన కాలుష్యపు నురగతో సర్వత్రా ఆందోళన నెలకొంది. పరిశ్రమల నుంచి వచ్చిన వ్యర్థాలు నది నీటిలో కలుస్తున్నాయని, తద్వారా ప్రాణాంతక వ్యాధులకు గురవుతామని అంటున్నారు. గతంలోనూ ఇలాంటి నురగ తెట్టు కనిపించింది. కాలుష్య నియంత్ర మండలి అధికారులు రంగంలోకి దిగి శాంపిళ్లు సేకరించి ల్యాబ్‌కు పంపించారు. అయితే, ప్రమాదకరమైన రసాయనాలేమీ నీటిలో కలువలేదని వారు అప్పట్లో స్పష్టం చేశారు. మళ్లీ నురుగ ఎందుకు వచ్చిందని కాలుష్య నియంత్రణ మండలి ఈఈ భిక్షపతిని సంప్రదిస్తే.. మంగళవారం వెళ్లి పరిశీలించి చెబుతామన్నారు. అయితే ఈనీటిని తప్పనిసరిగా కాచిచల్లార్చిన తర్వాతే తాగాలని కాలుష్య నియంత్రణ మండలి అధికారులు సూచించారు.

గురుకులంలో విద్యార్థినికి కుక్కకాటు

- గుట్టుచప్పుడు కాకుండా ఆస్పత్రిలో చికిత్స



ప్రిన్సిపాల్‌తో మాట్లాడుతున్న గిరిజన సంఘాల నాయకులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఏకలవ్య గురుకుల విద్యార్థినికి కుక్క కరిచిన సంఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. మండలంలోని దుమాలలో ఏకలవ్య గురుకుల విద్యాలయంలో ఆరో తరగతి విద్యార్థినిని ఆదివారం కుక్క కరిచింది. విద్యార్థినిని సిరిసిల్ల ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లి ఇంజక్షన్ చేయించి తల్లిదండ్రులకు గురుకుల ప్రిన్సిపాల్ రామారావు అప్పజెప్పారు. హాస్టల్‌లో మూడు కుక్కలను పెంచుతున్నట్లు తెలిసింది. విద్యాసంస్థల్లో పెంపుడు జంతువులను పెంచొద్దని నిబంధనలు ఉన్నప్పటికీ అమలు చేయకపోవడంపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సమాచారం తెలుసుకున్న బంజారా సంఘం జిల్లా అధ్యక్షుడు అజ్మీర రాజు, జిల్లా విజిలెన్స్ అండ్ మానిటర్ కమిటీ సభ్యులు తిరుపతి, గోపి, గుగులోతు తిరుపతి, ప్రకాశ్, ఎస్టీ సంఘం మండలాధ్యక్షుడు దేవిలాల్, సర్పంచులు ప్రభు, శంకర్, పుణ్య, సాయి సోమవారం గురుకుల పాఠశాలను సందర్శించారు. కుక్క దాడిపై ఆరా తీశారు.

పవర్‌లూమ్ కార్మికులకు చేసిందేమి లేదు

- సీఐటీయూ జిల్లా కార్యదర్శి మూశం రమేశ్



మాట్లాడుతున్న మూశం రమేశ్

సిరిసిల్లటౌన్: తెలంగాణ ఏర్పాటు తర్వాత బీఆర్ఎస్ సర్కారు గొప్పలు చెప్పుకోవడం తప్ప పవర్‌లూం కార్మికులకు చేసిందేమీ లేదని ఆ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర అధ్యక్షుడు మూశం రమేశ్ పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని బీవైనగర్‌లో సోమవారం ప్రెస్‌మీట్‌లో మాట్లాడారు. పవర్‌లూమ్ కార్మికులకు రావాల్సిన 2021 బతుకమ్మ చీరల యారన్ సబ్సిడీని ఎన్నికల కోడ్ వెలువడకముందే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈమేరకు అక్టోబర్ 4న జిల్లా చేనేత, జౌళిశాఖ ఆఫీస్ ముందు ధర్నా చేపడుతున్నామని కార్మికులు హాజరు కావాలని కోరారు. యూనియన్ నాయకులు నక్క దేవదాసు, గుండు రమేశ్, మోర తిరుపతి, నారాయణ, పోచమ్మ తదితరులు పాల్గొన్నారు.